('న్యూజెర్సీ కథల పోటీ'లో 150 రూపాయల బహుమతి పొందిన కథ)

# సంత

**సమయం 8 గంటలు దాటింది.**

**టిఫిన్ చేసి అప్పుడే అలా వీధిలోకి తొంగిచూశా. మామూలుగా సంచారం ఎక్కువలేని వీధి మాది. కానీ ఈ రోజు బుట్టలు నెత్తిన పెట్టుకుని వెళ్తున్న వాళ్ళతో, తోపుదు బళ్ళతో కాస్త రద్దీగా కనిపించింది.**

ఇంతలోనే దగ్గర్లోని టూరింగ్ టాకీస్ నుంచీ జోరుగా పాటలు వినిపించాయి. అప్పుడు గుర్తొచ్చింది నాకు ఈ రోజు సోమవారమని.

ప్రతి సోమవారం ఈ చిన్న ఊర్లో సంత జరుగుతుంది. ఊరివాళ్ళూ, ఊరి చుట్టుపక్కల వున్న చిన్న చిన్న పల్లెలవాళ్ళూ వారానికి సరిపడ్డ కూరగాయల్నీ, ఇంట్లోకి కావల్సిన వస్తువుల్నీ సంతే రోజే కొంటారు. సంతకొచ్చే జనాన్ని ఆకర్షించడానికి ఉదయం తొమ్మిది గంటల నుంచి టూరింగ్ టాకీసులో సినిమా వేస్తుంటారు. చుట్టుపక్కల ఊర్లవాళ్ళు సంత చేసుకుని సినిమా చూసుకుని వెళ్తుంటారు.

• గబగబా వంట పని పూర్తిచేసి సంతకెళ్ళాలి అనుకుంటున్నా. మామూలుగా ఈ సంత పని నేనూ, మా ఇంటి ప్రక్కనున్న బ్యాంక్ ఆఫీసర్‌గారి భార్యా కలిసి చేస్తుంటాం. స్టౌమీదికి కుక్కరెక్కించా. ఇంతలో—

"ఏవండీ సంతకెళ్దామా" అంటూ ఆఫీసర్‌గారి భార్య రెండు బాస్కెట్లు పట్టుకుని వచ్చేశారు.

"ఇంకా వంట కాలేదు" అన్నా.

"పదవుతోంది లతా, ఇప్పుడైతే కూరగాయలన్నీ తాజాగా వుంటాయి. నేను కూడా ఇంకా వంట వెయ్యలేదు" అన్నారు.

"సరే"నని ఓ పది నిమిషాల్లో కుక్కర్ దింపి బయలుదేరా.

సంతలో దారిపొడుగునా రెండు వైపులా పెద్ద పెద్ద గంపల్లో కూరగాయలూ, ఆకుకూరలూ పెట్టుకుని కూర్చున్నారు అమ్మేవాళ్ళు.

అప్పటికి ఎక్కువ రద్దీ లేదు. మెల్లగా బేరం చేస్తూ కావాల్సినవి కొంటూ ముందుకెళ్తున్నాం.

ఒకచోట ఓ పదేళ్ళ పాప చింపిరి జుట్టుతో, మాసిన బట్టల్తో వుంది. ఆ పిల్ల ముందు ఓ గంప నిండా ఆకు కూరలూ, మరో గంపలో లేత చిక్కుడు కాయలూ వున్నాయ్.

"మెంతికూర ఎట్లా?" అన్నా.

"అర్థరూపాయమ్మా" అంది.

నేనొక కట్ట తీసుకోవాలనుకుంటుండగా, "ఇంత చిన్న కట్ట అర్థరూపాయా! పావలా కియ్యి" అంది ఆఫీసర్‌గారి భార్య.

"గిట్టదమ్మా" అంది ఆ పిల్ల.

40 పైసలకు బేరమాడి రెండు కట్టలు కొన్నాం. అలాగే చుక్క కూర, కొత్తిమీర కొన్నాం.

చిక్కుడు కాయలు కిలో మూడు రూపాయలకు బేరమాడి, నేనొక అరకిలో, ఆవిడొక కిలో కొన్నాం. గీసి గీసి బేరం చేసి, ఆ పిల్లను నానా ఇబ్బందీ పెట్టింది ఆమె.

-యమ్. అన్నపూర్ణ

"ఏంది ఈ రాళ్ళూ, తూకం సరిగా లేదు" అంటూ కాస్సేపు గొడవ చేసింది.

మొత్తం 7 రూపాయల 30 పైసలైంది. నేను డబ్బివ్వబోయా. 'నేనిస్తా'నంటూ ఆవిడ పర్సు తీసింది. నేను పండ్లు కొనబోయాను.

ఇంతలో ఓ నలుగురు ఆడవాళ్ళు ఆ పాప దగ్గరకొచ్చి బేరం మొదలెట్టారు. ఆ పాప వాళ్ళ బేరసారాలలో పడిపోయింది. ఆఫీసర్‌గారి భార్య కనిపించిన మేనేజర్ గారి భార్యతో కబుర్లలో పడ్డారు.



ఆ తర్వాత ముగ్గురం కలిసి మాట్లాడుతూ వచ్చేశాం. ఎవరిళ్ళకు వాళ్ళెళ్లిపోయాం.

సాయంత్రం నాలుగ్గంటలకి పక్కింటి కెళ్ళాను. ఆవిడ ఎందుకో బాగా ఏడ్చినట్టున్నారు.

ఏమిటిలా వున్నారని అడిగాను.

"నా పర్సు ఎక్కడో పారేసుకున్నాను లతా! అందులో మా అమ్మాయికి ఎం.ఓ. చేయడానికని 500 వుంచాను. రాత్రి చెవి నెప్పిగా అనిపిస్తే నా కమ్మలు కూడా తీసి అందులోనే వుంచాను. బీరువా తాళాలూ అందులోనే వున్నాయి. ఎక్కడేసుకున్నానో! సంతలో మేనేజర్‌గారి భార్యతో మాట్లాడుతూ బాస్కెట్లో వేసుకున్నా. ఇంటికొచ్చి చూస్తే లేదు...! మధ్యాహ్నం మీ అన్నగారు వచ్చినపుడు చెప్తే నా నిర్లక్ష్యానికి చీవాట్లేసి వెళ్ళారు" అంటూ ఏడ్చేశారు.

పాపం ఆవిడ మధ్యాహ్నం భోజనం కూడా చేసినట్టు లేదు. నేనే కాస్త చొరవ చేసుకుని వెళ్ళి కాఫీ చేసిచ్చాను.

ఇద్దరం ఇంకా పోయిన పర్సును గురించి మాట్లాడుకుంటున్నాం. ఇంతలో—

"అమ్మయ్యా! అమ్మయ్యా" అనడం వినిపించింది.

"ఎవరో చూసొస్తా"నని ఆవిడ లేచి వెళ్ళారు. ఆవిడ వెనకాలే నేనూ వెళ్ళాను.

సంతలో కూరలమ్మే ఆ పిల్ల ఖాళీ బుట్ట చంకలో పెట్టుకుని నిలుచుంది. కళ్ళు తుడుచుకుంటూ ముక్కు ఎగబీలుస్తోంది, అప్పుడే దెబ్బలు తినివచ్చినట్టు.

"ఏమిటే!" అంది ఆవిడ కొంచెం కోపంగా, చిరాగ్గా.

"పొద్దుటేళ కూరలు కొని డబ్బివ్వలేదమ్మా! డబ్బు తక్కువైందని మా అయ్య కొట్టిండు" అంది.

"సరేలే, ఇస్తా. మాటల్లో మరచిపోయి వచ్చేశాను. ఇంతకీ మా ఇల్లు ఎలా కనుక్కున్నావ్?" అనడిగిందావిడ.

"మా అయ్య రిక్షా లాగుతాడు. మీ బ్యాంకి వోళ్ళే అప్పిచ్చినారంట. సార్‌ని చూసినా. మీ ఇల్లు తెలుసు" అంది. మళ్ళీ ఓ క్షణంలో గంపలోని పర్సు తీసి "ఇది మీదే గదమ్మా... మీరు మాట్లాడుతూ బుట్టలో ఏసుకోబోయి కిందేసుకున్నారు. నేనే తీసి పెట్టాను" అని అందించింది. మేము ఆ చింపిరి జుట్టు పిల్లకేసి చూస్తూ మాట్లాడలేకపోయాము.

ఆఫీసర్‌గారి భార్య పది రూపాయలివ్వబోతే "చిల్లర లేదమ్మా! 7 రూపాయల 30 పైసలియ్యండి" అంది.

నిజాయితీకి ప్రతిరూపంగా కనిపించే ఆ పిల్లకు చిల్లరిచ్చేశాం, ఏమీ ఇవ్వలేక!